సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



మట్టి అక్రమ తవ్వకాలు

కొయ్యలగూడెం మండలంలోని రాజవరం పంచాయతీ గంగవరం మెట్టగా పిలిచే ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. 8లో



చిరుద్యోగులపై పచ్చ ప్రతాపం

వీవోఏలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారి జీవితాల్లో చీకట్లు అలముకున్నాయి. 8లో



హత్యకేసులో ఆరుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెంలో జరిగిన హత్యకేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ తెలిపారు. 8లో

డ్రైవర్ల సేవలో.. నూ
కూటమి కుట్ర

భీమవరం(ప్రకాశం చౌక్): బ్యాడ్జ్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు, ట్యాక్సీ డ్రైవర్లకు, హెవీ లైసెన్స్ కలిగిన ప్రతి లారీ, టిప్పర్ డ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు ఆర్థికా సాయం చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ నీటిమూటగా మారింది. ఆటో డ్రైవర్ల సేవలో.. పథకాన్ని ప్రారంభించిన కూటమి ప్రభుత్వం లబ్ధి కొందరు ఆటో డ్రైవర్లకు మాత్రమే అందించి వేలాది మందికి మొండిచేయి చూపించింది. నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై డ్రైవర్లు గుర్రుగా ఉన్నారు. ఈ పథకంలోనూ 18 రకాల నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే కుట్ర చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సుమారు 16 వేల మంది వరకూ ఆటో డ్రైవర్లు ఉన్నారు. వీరంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు. తెల్ల రేషన్ కార్డు, ఏడాదికి ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉన్నా వీరిలో 8 వేల మందికి మాత్రమే ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద లబ్ధి అందించి మిగిలిన వారికి అనర్హులుగా తేల్చడంపై ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. లబ్ధిదారులను 50 శాతానికి పరిమితం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవనం కష్టసాధ్యం

అంతంతమాత్రం ఆదాయంతో ఆటోల నిర్వహణ, కష్ట సాధ్యంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం అందించే సాయంలోనూ కోత విధించం తగదని డ్రైవర్లు అంటున్నారు. అప్పులు చేసి, ఫైనాన్స్‌లో ఆటో కొనుగోలు చేసి నడుపుతూ జీవనం పొందుతున్నామని, అయితే ప్రస్తుతం నెలావారీ వాయిదాలు చెల్లించడం కష్టసాధ్యంగా ఉందని వాపోతున్నారు. అందరికీ సాయం అందిస్తామని హామీ ఇచ్చి పథకం అమలు చేసే సమయంలో నిబంధనలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనల మెలిక

- కొందరికే ఆర్థిక సాయం
- జిల్లాలో ఆటో డ్రైవర్లు సుమారు 16 వేల మంది
- సాయం అందింది కేవలం 8 వేల మందికే..
- అప్పులు, ఫైనాన్స్‌లతో జీవనం అగమ్యగోచరం
- బ్యాడ్జ్ ఉన్న వారందరికీ ఆర్థిక సాయం చేస్తామని మేనిఫెస్టోలో హామీ



భీమవరంలో ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు (ఫైల్)

90 శాతం ఫైనాన్స్‌పైనే..

జిల్లాలో సుమారు 16 వేల ఆటోలు ఉండగా 90 శాతం వరకూ ఆటోలను ఫైనాన్స్‌లో తీసుకుని డ్రైవర్లు నడుపుతున్నారు. వీరి రోజు వారీ సంపాదనలో 50 శాతం నెలవారీ వాయిదా కోసం కేటాయిస్తున్నారు. మిగిలిన దాంతో ఆటో నిర్వహణ, కుటుంబ పోషణ పరిపోని పరిస్థితి. కనీసం ఫైనాన్స్‌లకు వాయిదాలు చెల్లించేందుకు కూడా సొమ్ములు రావడం లేదని, కుటుంబ జీవనం కష్టంగా మారిందని వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితిలో ప్రభుత్వ సాయం కూడా అందకపోతే ఎలా అని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు వాహన మిత్ర సాయం అందించినప్పుడు లేని నిబంధనలు ఇప్పుడు ఎందుకని అంటున్నారు. హామీ మేరకు డ్రైవర్లందరికీ లబ్ధి చేకూర్చాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం అందించిన లబ్ధిని గుర్తుచేసుకుంటున్నారు.

విద్యుత్ బిల్లు సాకుతో కోత



“ నేను 15 ఏళ్లగా ఆటో ద్వారా ఉపాధి పొందుతున్నాను. గత ప్రభుత్వంలో నాకు వాహన మిత్ర సాయం వరుసగా అందించారు. ఇప్పుడు కూటమి పాలనలో విద్యుత్ బిల్లు ఎక్కువగా ఉందనే సాకుతో రూ.15 వేలు ఆర్థిక సాయం అందించలేదు. రెండు పోర్షన్ల ఇంటిలో నేను, మా తల్లి ఉండేవాళ్లం. రెండు మీటర్లు ఉండగా, ఇవి నా ఆధార్‌తో అనుసంధానం కావడం వల్ల ఆర్థిక సాయం అందించలేదు. నిబంధనలు పక్కన పెట్టి ఆటోపై బతికే ప్రతి డ్రైవర్‌కూ సాయం అందించారు.

– చవ్వకుల రాజేష్, ఆటో డ్రైవర్ అండలూరు

అర్హత ఉన్నా సాయం అందలేదు



ఆటోడ్రైవర్ల సేవలో పథకానికి అర్హత ఉన్నా నాకు సాయం అందించలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే అక్కడ కూడా సరైన సమాచారం లేదు. నేను 15 ఏళ్లుగా ఆటో ద్వారా ఉపాధి పొందుతున్నాను. నాకు ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు. 300 యూనిట్లలోపే విద్యుత్ బిల్లు కూడా వస్తుంది. అయినా సాయం అందలేదు. అర్హత ఉన్నా కూడా ఆర్థిక సాయం అందుకోలేకపోయాను. నాలాంటి వారందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి.

– పాలా విజయకుమార్, ఆటో డ్రైవర్, వేంద్ర

డ్రైవర్లందరికీ ఇవ్వాలి



కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కూ ఆర్థిక సాయం అందించాలి. నిబంధనల పేరుతో కోత విధించడం దారుణం. కూటమి ప్రభుత్వం అందరికీ ఆర్థిక సాయం చేస్తుందనుకున్నాం. అయితే కొందరికే అందించారు. జిల్లాలో 16 వేల మంది డ్రైవర్లు ఉంటే 8 వేల మందికే అందించడం బాధాకరం. ఆర్థిక సాయం అందని వారిని గుర్తించి న్యాయం చేయాలి. మేనిఫెస్టోను పక్కాగా అమలు చేయాలి.

–ఇంటి సత్యనారాయణ, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

కూటమి పాలనలో ఉద్యోగులకు కష్టాలు



చలో విజయవాడ పోరుబాటకు సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

భీమవరం: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న తలపెట్టిన చలో విజయవాడ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ పీఎస్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 16 నెలల పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల విషయం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నాలుగు డీఏల్లో కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడం నిరాశ కలిగించిందన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలని కోరారు. కో–చైర్మన్ సాయివర్మ, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల ఉద్యమానికి మద్దతు



ఆశా వర్కర్ల సంఘ జిల్లా కమిటీ సమావేశం

భీమవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు చేస్తున్న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఎండీ బేగం అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న ఉద్యమం న్యాయమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్యుల సంఘంతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో సరైన సౌకర్యాలు, వైద్యులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారున్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ మంగళవారం ఆశా డే సందర్భంగా అన్ని పీహెచ్‌సీల వద్ద ఆశావర్కర్లకు జీతాలు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్లతో వైద్యుల ఉద్యమానికి మద్దతుగా నిరసన తెలపాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి జ్యోతి, లారెన్స్ కుమారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: అధికారుల వేధింపుల తాళలేక శనివారం కలుపు మందు తాగిన పారిశుద్ధ్య కార్మికుడు పూనకం మునియ్య (52) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీంతో అతడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. మునియ్య మృతికి కారణమైన మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోస్టుమార్టం నిర్వహించకుండా మృతదేహాన్ని తమకు అప్పగించాలని ఆందోళన చే శారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని మునియ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినందున తప్పనిసరిగా పోస్టుమార్టం నిర్వ హించాలని మునియ్య బంధువులకు ఎస్సై నచ్చజెప్పారు. అనంతరం మునియ్యను వేధింపులకు గురిచేసి అతడి మృతికి కారణమైన పారిశుద్ధ్య అధికారులపై పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఆదివారం కావడంతో మునియ్య మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు పోలీసులు చెప్పారు.

11న ఎంటీఎస్ టీచర్ల విజ్ఞాపన సభ

భీమవరం: మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లుగా 25 ఏళ్లుగా పనిచేస్తున్న 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11న విజయవాడలో విజ్ఞాపన సభ నిర్వహించనున్నట్టు ఎంటీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ తెలిపారు. విజ్ఞాపన సభ సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక లూథరన్ హైస్కూల్‌లో నిర్వహించారు. టెంపరరీ ఎంటీఎస్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, 62 ఏళ్ల వరకు సర్వీస్ పెంచాలని, 12 నెలల జీతం, మినిమమ్ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని కోరారు. కో–ఆర్డినేటర్లు ఎం.రాజలింగం, ఎస్.అనిల్ అరవింద్ కుమార్, ఎంవీ కృష్ణారావు, హేమంత్‌కుమార్, వీఎల్ఎన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో ప్రభుత్వ చర్యలు విడ్డూరం



వ్యవసాయ కార్మిక సంఘ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఉపాధి హామీలో అవినీతి నిర్మూలనకు ప్రభుత్వ చర్యలు విడ్డూరంగా ఉన్నాయని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. ఏపీ వ్యవసాయ కా ర్మిక సంఘం జిల్లా 33వ మహాసభల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీలో ఈకేవైసీ ఆధార్ అనుసంధానం పైలెట్ ప్రాజెక్టుగా కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రారంభించారని, అయితే ఎన్ఎంఎంఎస్ యాప్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలకు ఈకేవైసీ విధానం మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిధులు, పని దినాలు, వేతనాలు, సౌకర్యాలు పెంచాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం 33వ మహాసభ నవంబర్ 10, 11వ తేదీల్లో అత్తిలిలో నిర్వహించనున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు, కండెల్లి సోమరాజు, జె.వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులు బల్ల చిన వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా అవార్డుల ప్రదానం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లాకు ఒక రాష్ట్రస్థాయి, 49 జిల్లాస్థాయి అవార్డులు వరించాయన్నారు. పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు.

నేను మరొకరికి గాయం కలిగించక ముందే..



విర్డ్ ఆస్పత్రి ఎదురుగా రోడ్డుపై హెచ్చరిక బోర్డు



వినూత్న హెచ్చరిక బోర్డు

- గుంతల రహదారిపై వినూత్న హెచ్చరిక బోర్డులు
- అధ్వానంగా ద్వారకాతిరుమల క్షేత్ర రహదారి

ద్వారకాతిరుమల : 'నెమ్మదిగా వెళ్లండి.. నేను కుటుంబాలతో ప్రయాణించే వ్యక్తులను గాయపరుస్తున్నాను. నేను మరొకరికి గాయం కలిగించక ముందే దయచేసి నన్ను త్వరగా మరమ్మతులు చేయండి' అంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నట్టుగా ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు భీమడోలు–ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారి దుస్థితికి అద్దం పడుతున్నాయి. భారీ గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారిపై ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు గుంతల్లో మెటల్ డస్ట్ పోయించారు. అయితే రెండు రోజులకే రోడ్డు యథాస్థితికి చేరుకుంది. నిత్యం వందలాది వాహనాలు ఇటుగా ప్రయాణిస్తున్నా పూర్తిస్థాయిలో మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు పై వ్యాఖ్యలతో ఉన్న ఇంగ్లిష్ హెచ్చరిక బోర్డులను రహదారిపై పలుచోట్ల ఏర్పాటుచేశారు. బోర్డుల చుట్టూ పసుపు రంగు రేడియం స్టిక్కర్లు కూడా అతికించారు. ఇటుగా వెళుతున్న వాహనచోదకులు ఆగి మరీ బోర్డులను చదివి జాగ్రత్తగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని పలువురు కోరుతున్నారు.



ఎదుర్కోలు ఉత్సవంలో స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు



హనుమంత వాహనంపై రామావతారంలో స్వామివారు

ఎదుర్కోలు వైభవం

- స్వర్ణ హనుమంత వాహనంపై ఊరేగిన శ్రీవారు
- నేటి రాత్రి స్వామి తిరుకల్యాణం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో స్వామివారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నూతన స్వర్ణ హనుమంత వాహనంపై స్వామివారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారి నిత్య కల్యాణ మండపంలో జరిగిన శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం భక్తులను పరవశింపజేసింది.

ఎదుర్కోలు ఉత్సవం ఇలా..

తొలుత స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి వెండి శేష వాహనంపై నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ విశేషంగా అలంకరించిన వేదికపై కల్యాణ మూర్తులను ఉంచి పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలు, కీర్తిని తెలియజేశారు. స్వామి కల్యాణోత్సవానికి ముందు రోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఈ ఎదుర్కోలు ఉత్సవమని పండితులు తెలిపారు. రాత్రి స్వామివారికి జరగాల్సిన వెండి శేష వాహన సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. ఆలయ ముఖ మండపంలో భూ వరాహ స్వామి అలంకారంలో స్వామి దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



భూ వరాహ స్వామి అలంకారంలో చినవెంకన్న

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై గ్రామోత్సవం
- ఉదయం 8 గంటల నుంచి భజనలు
- ఉదయం 9 గంటల నుంచి భక్తిరంజని
- ఉదయం 11 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వర కచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి శ్రీవారి తిరుకల్యాణం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం
- ప్రత్యేక అలంకారం : మోహినీ

● ముంచెత్తిన వాన.. ప్రయాణానికి హైరానా



పంగిడిగూడెంలో పోలవరం కాలువ వంతెనపై వర్షం నీటిలో రాకపోకలు

అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై జోరు వాన కురిసింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు కాలువలను తలపించాయి. ద్వారకాతిరుమల మండలంలోని పలు గ్రామాల్లో వర్షం దంచి కొట్టడంతో పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువ వంతెనపై నీరు భారీగా నిలిచిపోయింది.ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారిలోని పంగిడిగూడెం డెయిరీ వద్ద, స్థానిక కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

– ద్వారకాతిరుమల

పాఠశాలల్లో జీఎస్టీపై ప్రచారం సరికాదు

ఏలూరు (టూటౌన్): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ విషయంపై ఈనెల 19 వరకు పాఠశాలల్లో ప్రచారం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు ఇవ్వటం, ఉపాధ్యాయులు దానిని పాటించాలని జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఆదేశించడం సరికాదని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయమని ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబు? అని ప్రశ్నించారు. జీఎస్టీ చరిత్ర ఏమీ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర కాదని, విద్యార్థులకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించుకుంటూ పోతే ఎలా అని అన్నారు. పథకాల ప్రచారానికి పాఠశాలలను వేదిక చేసుకోవడాన్ని తాము ఖండిస్తున్నామన్నా రు. ఇలాంటి కార్యక్రమాలతో బోధనా సమయం హరించుకుపోతుందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ పక్షాన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కొత్త బస్సులకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య

తణుకు అర్బన్: ఆర్టీసీలో కొత్త బస్సుల కోసం నిధులు కేటాయించకుండా స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారని, కొత్త బస్సులకు నిధులు కేటాయించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య అన్నారు. ఫెడరేషన్ పశ్చిమ గోదావరి జిల్లా రెండో మహాసభలు ఆదివారం తణుకు అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ప్రారంభమైన నెల రోజుల్లోనే కండక్టర్లు, డ్రైవర్లపై వేధింపులు, కేసులు, 60 మందికిపైగా సస్పెన్షన్లు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. పథకం ఉద్యోగులను వేధించే పథకంగా మా రకూడదని, కొత్త బస్సులు వేసి ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ బస్సుల సాకుతో..

విద్యుత్ బస్సుల సాకుతో ఆర్టీసీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యలు వెంటనే ఆపాలని, తొలి దశలో ప్రధాన నగరాల్లోని 2 డిపోలను, రెండో దశలో 19 డిపోలను ప్రైవేట్ విద్యుత్ బస్సు ఆపరేటర్లకు అప్పజెప్పేలా సన్నాహాలు జరుగుతున్నాయని సుందరయ్య విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు టీవీఎస్ మూర్తి జెండా ఆవిష్కరణ చేసి మహాసభకు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి ఏఎస్ రాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర, డిపో కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, ఆర్.ఆంజనేయులు, నరసింహారావు, కట్ట సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్దిలో హనుమద్ హోమం



జంగారెడ్డిగూడెం మద్దిక్షేత్రంలో హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం, అనంతరం హనుమద్ హోమం వైభవంగా నిర్వహించినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు.

పెద్దింట్లమ్మా.. కరుణించమ్మా



పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ కరుణా కటాక్షాలు మాపై అందించమ్మా.. అంటూ భక్తులు ఆర్తీతో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. సమీప జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి వేడి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ప్రధాన ఉప అర్చకులు పేటేటి పరమేశ్వర శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు, అమ్మవారి చిత్రపటాల విక్రయాలు, వాహనపూజలు, విరాళాల ద్వారా రూ.58,342 ఆదాయం వచ్చిందని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

కట్నం వేధింపులపై కేసు

అత్తిలి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న అత్తిలి మండలం స్కిన్నెరపురానికి చెందిన భానుకృష్ణను ఉండి మండలం యండగండికి చెందిన గంగుల సతీష్ కుమార్‌కి ఇచ్చి వివాహం చేశారు. ఈ సమయంలో రూ. 40 లక్షల నగదు, 36 కాసుల బంగారం, ఐదు కిలోల వెండి పూజా సామాగ్రి ఇచ్చినట్లు తెలిపారు. భర్త జర్మనీలో ఉద్యోగం చేయడంతో పుట్టింటి నుంచి ఆస్తులు అమ్మి డబ్బు తేవాలని అత్తమామలు వేధించేవారని తెలిపారు. గత నెల 17న నిందితుడు అత్తమామల ఇంటికి వచ్చి బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చిరుద్యోగులపై పచ్చ ప్రతాపం

- జిల్లాలోని వీవోఏలపై కూటమి నాయకుల వేధింపులు
- వేధింపులు తట్టుకోలేక రాజీనామాలు
- తెలుగు తమ్ముళ్లకు వత్తాసు పలుకుతున్న డీఆర్‌డీఏ ఏపీఎంలు, సీసీలు



ఏలూరులో ధర్నా చేస్తున్న వీవోఏలు(ఫైల్)



డ్వాక్రా గ్రూపు సమావేశంలో పాల్గొన్న మహిళలు(ఫైల్)

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు గౌరవ వేతనం రూ.8 వేలతో కాలం వెళ్లదీస్తున్న వీవోఏలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారి జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. తెలుగు తమ్ముళ్ల వేధింపులు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. మీరు ఉద్యోగాల్లోంచి తప్పుకుంటే మా మనుషులను పెట్టుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కి ధర్నాలు, నిరసనలకు దిగితే ఊరుకునేది లేదని.. మొత్తం అందరినీ విధుల్లోంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారు.

ఏలూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 39,539 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. వీటి పరిధిలో 3,89,801 మంది సభ్యులు ఉన్నారు. గ్రామ సమాఖ్యలు 1300 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 1300 మంది వీవోఏలు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే 150 మందిని ఎలాంటి కారణాలు లేకుండా తొలగించారు. స్థానిక తెలుగు తమ్ముళ్లు చెప్పినట్లు వింటేనే విధుల్లో ఉండండి లేకుండా రాజీనామాలు చేసి వెళ్లిపోండి అని బెదిరిస్తున్నారు.

లింగపాలెం మండల పరిధిలో 11 మందిని తెలుగు తమ్ముళ్ళు విధుల్లోంచి తొలగించేలా చేసారు. వీరిలో ఏడుగురు ఎస్సీలు ఉండటం గమనార్హం. వీరంతా కలిసి కోర్టుకు వెళ్ళారు. కోర్టు సైతం వారిని విధుల్లో కొనసాగించాలంటూ ఉత్తర్వులు ఇచ్చింది. వీరు ఇంతకు ముందు పనిచేసే చోట కొత్తవారిని నియమించేసారు. దీంతో 11 మంది కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ డీఆర్‌డీఏ అధికారులు, స్పందనలో కలెక్టర్‌కు తమ గోడు మొరపెట్టుకున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పుడు ఇబ్బంది ఏమి ఉంది వెళ్లి మీ విధులు మీరు చేసుకోండి అని చెప్పి పంపించేస్తున్నారు. తీరా అక్కడకు వెళ్ళాక ఆ మండల ఏపీఎం వీరితో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో ఒక్క మాట చెప్పి మిమ్మల్ని విధుల్లోకి తీసుకుంటామంటూ చెప్పడంతో బాధితులు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

వీఓఏల ప్రధాన డిమాండ్లు

- బకాయి వేతనాలు చెల్లించాలి.
- ఆన్‌లైన్ పని భారం తగ్గించాలి.
- 5జీ మొబైల్స్ అందించాలి.
- కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి.
- వేతనాలు పెంచాలి.
- హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.
- రూ.10 లక్షల గ్రూప్ బీమా కల్పించాలి.
- అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్‌లు కల్పించాలి.

అందని వేతనాలు

జిల్లా వ్యాప్తంగా వీవోఏలకు నెల నెలా వేతనాలు విడుదల చేయడం లేదు. అసలే ఇచ్చేది నామమాత్రపు వేతనం. అదీ నెల నెలా ఇవ్వకపోవడం పట్ల వీవోఏలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గట్టిగా అడిగితే స్థానిక ప్రజాప్రతినిధులు ఇష్టముంటే చేయండి లేకుంటే తప్పుకోండి అంటూ సమాధానం ఇస్తుండటంతో వీవోఏలు మౌనంగానే వేతనాలు రాకపోయినా తమ పని తాము చేసుకుని వెళుతున్నారు.

రాజకీయాలతో ముడిపెట్టి వేధింపులు



లింగగూడెంతో గత పదేళ్లకు పైగా వీవోఏగా కొనసాగుతున్నాను. నా భర్త గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో తిరిగారనే సాకుతో ఉద్యోగానికి రాజీనామా చేయాలని కోరుతున్నారు. స్థానిక నేతలు నేరుగానే బెదిరింపులకు దిగుతున్నారు. రాజకీయాలతో ముడిపెట్టి వేధింపులు, ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసం.

మల్లెల్లి ద్వారకా, లింగగూడెం, చింతలపూడి మండలం

వేధింపులకు తట్టుకోలేక



ఉంగుటూరు మండలం బొమ్మిడిలో 2009 నుంచి పనిచేస్తున్నారు. ఇటీవల ఎన్నికల అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ నేత మానాలని వేధింపులకు దిగారు. దీంతో వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేశాను. బంధువులు సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో బతికి బయట పడ్డా. కుటుంబ సభ్యులకు మాత్రం రూ.1.80 లక్షల ఖర్చు మిగిల్చింది.

వంపుగడవ శారద, బొమ్మిడి, ఉంగుటూరు మండలం

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి



విధుల్లోంచి తొలగించిన వీవోఏలను తక్షణం విధుల్లోకి తిరిగి తీసుకోవాలి. వారికి గత ఐదు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు విడుదల చేయాలి. ఎక్కడైనా ఎవరైనా తప్పు చేస్తే వారిపై శాఖపరమైన విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలే తప్ప ఈ విధంగా చేయడం తగదు.రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు ధోరణులు అమానవీయం. ఆర్.లింగరాజు,

జిల్లా అధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

బెదిరిస్తున్నారు



వీవోఏలకు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నేరుగా వార్నింగ్‌లు ఇస్తున్నారు. మీరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కి ఆందోళనలు, నిరసనలు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. చింతలపూడి మండలంలో ఒక టీడీపీ నాయకుడు ఏకంగా ఎవరూ రోడ్డెక్కడానికి వీల్లేదని అతిక్రమిస్తే ఆ రోజు నుంచి విధుల్లోకి రావాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

ఎస్‌కె.సుభాషిణి, వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి, ఏలూరు

రైతుల భూములు లాక్కోవడం దుర్మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి రైతుల భూములను ప్రాజెక్టుల పేరుతో, పరిశ్రమల పేరుతో బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. స్థానిక అన్నే భవనంలో నిర్వహించిన సంఘ ముఖ్య నేతల సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న రైతాంగ సమస్యలపై ఈ సందర్భంగా చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి అన్ని పంటలకూ మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నేతలు ఎస్.సీతారామయ్య, కె.జలపాలు, బి.రాంబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: మండలంలోని శోభనాపురంలో వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై శుభ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మేడా తిరుపతిరావు (36) తోట రమేష్‌కి చెందిన పందుల ఫాంలో సహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం పందుల ఫాంను తిరుపతిరావు నీటితో శుభ్రం చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతి రావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్యంతో కొన్ని రోజుల క్రితం అతని కుమారుడు మరణించాడు. ఇంతలోనే తిరుపతిరావు మరణించడంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలముకున్నాయి.

హత్యకేసులో ఆరుగురి అరెస్ట్

- రెండు రోజుల్లోనే కేసును చేధించిన పోలీసులు
- చోరీ సొత్తు పంపకాల్లో విభేధాలే హత్యకు కారణం: పోలీసులు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగిన హత్యకేసును పోలీసులు రెండు రోజుల్లోనే చేధించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర వెల్లడించారు. ఆదివారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలో చేసిన దొంగతనాలకు సంబంధించి చోరీ సొత్తు పంపకాల విషయంలో జరిగిన విభేదాల కారణంగా పాత నేరస్తుడు కర్రి రాజేష్ (26) హత్యకు దారి తీసినట్లు చెప్పారు. ఈ కేసులో పట్టణానికి చెందిన షేక్ ఖాసిం, అతని అన్నలు షేక్ నాగుల్ మీరా, షేక్ జహీరుద్దీన్ అలియాస్ చోటు, వాసంశెట్టి పవన్‌కుమార్ అలియాస్ స్కైలాబ్, సమ్మంగి మంగరాజు, మరీదు సాయి అలియాస్ సైకో సాయిలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు.

కర్రి రాజేష్, షేక్ ఖాసిం తదితరులు కలిసి దొంగతనాలు చేసేవారని, గతంలో వరంగల్ జిల్లాలో చేసిన దొంగతనాల్లో సొత్తు పంపకాల విషయంలో విభేదాలు తలెత్తినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెంలో పోలీసులు గతంలో రాజేష్‌ను అరెస్టు చేసినప్పుడు ఖాసిం తదితరుల పేర్లు పోలీసులకు చెప్పడంతో వీరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తమకు కోర్టులో బెయిల్ కోసం రూ.2 లక్షల వరకు ఖర్చు అయ్యాయని, ఖాసిం తదితరులు బెయిల్ కోసం ఖర్చుచేసిన డబ్బులు ఇవ్వాలని రాజేష్‌ను ఒత్తిడి చేశారు. అప్పటి నుంచి రాజేష్ తప్పించుకుని తిరుగుతుండగా, వీరి మధ్య వివాదం ముదిరింది. గత నాలుగైదు నెలల క్రితం ఖాసింను చంపేందుకు కర్రి రాజేష్ పథకం రూపొందించగా, అది విఫలమైంది. అది తెలుసుకున్న ఖాసిం, అతని సోదరులు నాగుల్ మీరా, జహీరుద్దీన్ రాజేష్‌ను అంతమొందించాలని పథకం వేశారు. ఈ నెల 3న రాజేష్‌ను అతని ఇంటికి వెళ్లి వెంబడించి తీసుకువెళ్లి స్థానిక బైనేరు ఒడ్డున ఖాసిం ముఠా హత్య చేసింది. ఆరుగురు కలిసి రాజేష్‌ను తీవ్రంగా కొట్టి, టవల్‌తో కాళ్లు కట్టేసి, పలు సార్లు కత్తితో పొడిచి గొంతు కోసి, చాకుతో పొడిచి పేగులు బయటకు వచ్చేలా దారుణంగా హత్య చేశారని డీఎస్పీ వివరించారు. హత్యకు ఉపయోగించిన రెండు చాకులు, రెండు మోటార్‌సైకిళ్లు, ఒక స్కూటీ, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నిందితులపై పలు స్టేషన్లలో కేసులు

నిందితులు షేక్ ఖాసింపై సస్పెక్ట్ షీట్ ఉందని, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, నల్లజర్ల, వరంగల్‌లో పలు కేసులు ఉన్నట్లు చెప్పారు. నాగుల్ మీరాపై జంగారెడ్డిగూడెం, వరంగల్, స్కైలాబ్‌పై జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెంలలో, మంగరాజు, చోటు, సైకో సాయిలపై జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో కేసు ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. వీరిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

పెంటపాడు: పెంటపాడు మండలం రావిపాడు గ్రామ శివారు గ్రామ దేవత కొండాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామ ఆలయకమిటీ అధ్యక్షుడు ఉప్పులూరి అంజిబాబు పెంటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. హుండీ లెక్కింపు జరగాల్సి ఉండగా ఈ చోరీ జరిగింది.

మట్టి అక్రమ తవ్వకాలు



కొయ్యలగూడెం మండలం గంగవరం సమీపంలోని కొండ ప్రాంతాన్ని భారీగా తవ్విన దృశ్యం

కొయ్యలగూడెం: తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్న చందంగా గంగవరం మెట్ట ప్రాంతం సిరులు కురిపిస్తుంది. రాజవరం పంచాయతీ గంగవరం మెట్టగా పిలవబడే ప్రాంతం నాణ్యమైన గ్రావెల్‌కి పెట్టింది పేరు. దీంతో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల మండలాలకు చెందిన అక్రమార్కులు సిండికేటుగా ఏర్పడి గ్రావెల్ తవ్వకాలను భారీగా నిర్వహిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు లాభసాటిగా ఉండటంతో అక్రమార్కులు ఏకంగా సొంతంగా లారీలనే కొనుగోలు చేసి గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. తవ్వకాలను నిరోధించాల్సిన వివిధ శాఖల అధికారులకు ముందుగానే అధికార పార్టీ పెద్దలు హుకుం జారీ చేయడంతో వీళ్ళ ఇష్టారాజ్యం సాగుతోంది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వ్యవసాయ పొలాలలోకి వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారుతున్నాయని అసలే వర్షాకాలం కావడంతో భారీ గోతులు పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. గంగవరం ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీచ్‌లో వ్యక్తి గల్లంతు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ఆదివారం సముద్ర స్నానం చేస్తుండగా ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి మొగల్తూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నగరంలోని సింగ్‌నగర్‌కు చెందిన మాదేపల్లి ప్రవీణ్ మరో 12 మంది స్నేహితులతో కలసి రెండు వాహనాల్లో పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానం చేస్తుండగా అలల ఉధృతికి ప్రవీణ్ గల్లంతయ్యాడు. ప్రవీణ్‌తో పాటు వచ్చిన వారంతా కంకిపాడులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగస్తులు. ఆదివారం సెలవు కావడంతో సరదాగా గడిపేందుకు వచ్చిన వారిలో ప్రవీణ్ గల్లంతవ్వడంతో అతని మిత్రులు ఆందోళన చెందుతున్నారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

యలమంచిలి: చించినాడ వశిష్ట గోదావరి వంతెన మీద నుంచి దూకి యువకుడు గల్లంతయ్యాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన మేడిది సుదర్శనరావు (25) సెల్ ఫోన్, బైక్ వంతెన మీద ఉన్నాయి. స్థానికులు వాటిని పోలీసులకు అందజేశారు. ఆ ఫోన్‌కు సుదర్శనరావు బంధువుల నుంచి ఫోన్ రావడంతో పోలీసులు విషయం తెలిపారు. దీంతో బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గోదావరిలో దూకి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. మలికిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పి సెల్, బైక్ తీసుకెళ్లినట్లు తెలిసింది.

గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

అత్తిలి: మండలంలో వరిఘేడు గ్రామానికి చెందిన ఉల్లి పెద్దిరాజును సోదరుడు ఆస్తి విషయమై గొడవపడి గాయపర్చటంతో సోదరుడు కృష్ణపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి.ప్రేమ రాజు తెలిపారు. పెద్దిరాజు సైకిల్‌పై కిరాణా దుకాణానికి వెళ్తుండగా నిందితుడు తన షాపులో ఉండి పెద్దిరాజును దూషించడంతో పాటు కొట్టాడు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై దాడి

ముదినేపల్లి రూరల్: పాతకక్షల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటన మండలంలోని చిగురుకోటలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎ.గోపిలక్ష్మీకి నాగ తిరుపతమ్మకు పాత కక్షలున్నాయి. ఈ నెల 2న గోపిలక్ష్మీ ఊరేగింపులో పాల్గొని ఇంటికి వెళుతుండగా తిరుపతమ్మ దాడి చేసి గాయపరిచింది. ఆమెకు మద్దతుగా శ్రీరామకృష్ణ వచ్చి దాడి చేసినట్లు గోపిలక్ష్మీ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్వాసితులను గాలికొదిలేశారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత పోలవరం ప్రాజెక్టును 2027కి పూర్తి చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో వినియోగించి యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేని స్థితిలో ఉండి 2027కి పోలవరం ప్రాజెక్టు ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను గాలికి వదిలేశారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు ఎత్తు తగ్గిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి ప్రయోజనాలను నెరవేర్చలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో రోజుకో మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్యత క్రమంలో జరిపేందుకు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు షెల్టర్ల ఏర్పాటు ఎప్పుడో?



ఏలూరు రోడ్డులో షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపైనే బస్సులు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



ఎన్‌టీఆర్ జంక్షన్ వద్ద బస్సులు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

- నిలువ నీడ లేక.. కూర్చోడానికి సీటు లేక
- ఉచిత బస్సుల్లో ప్రయాణికుల అవస్థలు
- పలు సెంటర్లలో కానరాని షెల్టర్లు
- పట్టించుకోని అధికారులు



తాలూకా ఆఫీస్ సెంటర్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



హౌసింగ్‌బోర్డు, ఎస్‌వీఆర్ సర్కిల్ వద్ద నిరుపయోగంగా బస్సు షెల్టర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. అయితే మహిళలకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో వారు బస్సుల్లో కూర్చోడానికి సీట్లు లేక నిలువకాళ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. తాడేపల్లిగూడెం పట్టణంలో పలు సెంటర్లలో బస్ షెల్టర్లు లేక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ బస్సు వచ్చే వరకు వేచి ఉండి తమ గమ్యస్థానాలకు వెళ్లాల్సి వస్తోంది.

బస్సు షెల్టర్లు లేని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం బస్సు కాంప్లెక్స్ నుంచి ఏలూరు, భీమవరం, తణుకు, నల్లజర్ల వైపు బస్సు రూట్లు ఉన్నాయి. తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద బస్సు షెల్టర్ లేదు. అదే విధంగా మరో ప్రధాన సెంటర్ శేషమహల్ రోడ్డు ప్రారంభంలో ఎన్‌టీఆర్ జంక్షన్ వద్ద షెల్టర్ లేదు. ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రయాణించి మోడ్రన్ కేఫ్ ప్రక్కన ఏలూరు వైపు వెళ్లే బస్సులు కోసం స్టాప్ వద్ద షెల్టర్ లేదు. పాత ప్రభాత టాకీస్ సమీపంలో భీమవరం వైపు వెళ్లే బస్సు స్టాప్ వద్ద సైతం షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు వర్ణణాతీతం. తణుకు, నిడదవోలు వైపు వెళ్లే బస్సు షెల్టర్ కాలువ సమీపంలో ఉంది. షెల్టర్ ఉన్నా వచ్చే బస్సులు కనపడకపోవడంతో షెల్టర్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలోనే ప్రయాణికులు బస్సులు కోసం నిలుచుని వేచి చూస్తున్నారు. అదే విధంగా నల్లజర్ల వైపు గొల్లగూడెం సెంటర్ వద్ద షెల్టర్ లేదు. హౌసింగ్‌బోర్డు సెంటర్ వద్ద దాతలు షెల్టర్ ఏర్పాటు చేసినా అదిమూలకు ఉండడంతో అది నిరుపయోగంగా మారింది. నేడు ఆ బస్సు షెల్టర్‌ను ఎవరూ ఉపయోగించడం లేదు.

షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు

షెల్టర్లు లేకపోవడం కారణంగా వేసవిలో తీవ్రమైన ఎండల కారణంగా ప్రయాణీకులు బస్సుకోసం నిలబడటం కష్టసాధ్యంగా మారింది. ఎండలు మండుతున్న సమయంలో ప్రయాణీకులు షెల్టర్ కోసం చూస్తారు. ప్రయాణీకులు షెల్టర్ లేకపోవడంతో బస్సులకోసం రోడ్డుమీదే నిలబడి ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో సైతం షెల్టర్‌లేక వర్షంపడిన సమయంలో షాపులు వద్ద నిలబడటం, లేని పక్షంలో రోడ్డుపైనే ఉంటున్నారు. షెల్టర్లు లేకపోవడం వల్ల కొంతమంది బస్సు డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్లిపోతున్నారని ప్రయాణీకులు వాపోతున్నారు. ముఖ్యంగా ఏలూరు వైపు వెళ్లే రహదారిలో ప్రయాణీకులు బస్సు ఎక్కేవరకు ఎక్కడ వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. అదేవిధంగా ప్రయాణీకులు రోడ్లపైనే బస్సులకోసం నిలబడితే ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. బస్సు వచ్చే వరకు కూర్చునేందుకు వీలుగా షెల్టర్ అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్‌టీఆర్ జంక్షన్, భీమవరం వైపు, ఏలూరు వైపు బస్సు షెల్టర్లు నిర్మాణం చేపట్టి బస్సులను రోడ్డు మీద నిలిపి ఉంచకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు చెబుతున్నారు.

బస్సు షెల్టర్లు నిర్మించాలి



పట్టణంలో బస్సు షెల్టర్లు నిర్మించాలి. తద్వారా ప్రయాణీకులు బస్సులకోసం రోడ్డు మీద పడిగాపులు పడనవసరంలేదు. షెల్టర్లు నీడనిస్తాయి. బస్సులు వచ్చేవరకు కూర్చునేందుకు, సేద తీరేందుకు ఉంటుంది.

– తాడేపల్లి శ్యాంబాబు, తాడేపల్లిగూడెం

'గూడెం'లో భారీ వర్షం



పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు సాధారణంగానేఉంది. తదుపరి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు తడిసి ముద్దయ్యాయి. రాత్రి ఒక్కసారిగా కురిసిన వర్షంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేశారు. అయితే, భారీ ఎత్తున ఉరుములు, మెరుపులతో ప్రజలు భీతిల్లిపోయారు.

నరేంద్రకుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రి 'కొట్టు'



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్ర కుమార్ నానమ్మ కాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం నరేంద్రకుమార్, కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. కాంతమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పెద్ద మృతి చెందితే ఆ బాధ తీర్చలేనిదని ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మకు ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయంనుంచి రాత్రివరకు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ప్రత్తిపాడు, గూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, తీన్‌మార్, గరగల నృత్యాలు, బాణసంచా తదితర ఉత్సవ సామగ్రితో అమ్మవారిని ఆయా గ్రామాల్లో ఊరేగించారు. ఈవో జవ్వాది కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, అర్చకులు సుబ్రహ్మణం, తూము చిన్న, తాడిపర్తి వీరాస్వామి, కమిటీ పెద్దలు, ఆయా గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంవీవీ రాఘవేంద్రరెడ్డి



దివ్యాంగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎంవీవీ రాఘవేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కొత్త వీర్రాజు, ముఖ్యసలహాదారుగా పులిమి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా కోరిసిక శ్రీనివాసరావు, సెక్రటరీ ఆమంచి నాని, సంయుక్త కార్యదర్శులుగా కోరసిక నాగరాజు, టి.బాలాజీ, కోశాధికారిగా వీవీఎస్ సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలుగా ప్రసన్న, సెక్రటరీగా చింతాడ పద్మ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వక్తలు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఇంటికే ఉచిత వైద్యసేవలు



తణుకులో వృద్ధుడికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రామకృష్ణ

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ వైద్యసేవలందించారు. ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, పైడిపర్రు, మండపాక ప్రాంతాల్లోని 6 గురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌లో ఘనంగా యూత్ సమావేశం



మాట్లాడుతున్న సేవకురాలు ప్రైజీ ప్రవీణ్

పెంటపాడు: యువత బైబిలు వాక్యసారంగా ఆధ్యాత్మిక జీవనం సాగించాలని, తద్వారా యూత్ విశ్వాసులు ఆధ్యాత్మిక స్నేహభావంగా మెలగాలని ఈపీఎఫ్ సంఘ పాస్టర్ పి.మోజస్‌ప్రవీణ్ పేర్కొన్నారు. తణుకు ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో అక్టోబర్ నెల మొదటి ఆదివారం పురస్కరించుకొని యూత్ సమావేశం నిర్వహించారు. సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన అనంతరం పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రైస్తవ యువత తోటివారికి మార్గదర్శిగా ఉండాలన్నారు. సేవకురాలు ప్రైజీ ప్రవీణ్ ఆధ్యాత్మిక సందేశం అందించారు. అనంత రం భక్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశా రు. సాయంత్రం ఉండ్రాజవరం గ్రామంలో నూతన మందిర ప్రతి ష్ట ఆరాధన సేవకులు, విశ్వాసుల ఆధర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

వడలిలో ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: మండలంలోని వడలిలో అన్నార్థులకు అక్షయ పాత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. పిట్టల వేమవరానికి చెందిన మల్లిడి సత్యనారాయణ రెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను వడలి అక్షయ పాత్రకు అందించారు. దీంతో వారు పేదలకు వీటిని పంపిణీ చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న గరికపాటి బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ గరికపాటి బాపయ్య శర్మ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. వి లవ్ రీడింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ 1966 నుంచి యునెస్కో సూచనలు మేరకు ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయల గుర్తింపు, జీవన పరిస్థితులు, ప్రోత్సాహం, విద్యా ప్రమాణాలు పెంపు తదితర విషయాలను విద్యార్థులు, చదవరులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏవీ లక్ష్మణరావు, వి.జానుబాబు, సిబ్బంది, స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఇరుముడుల సమర్పణ



వాసవీ శాంతి ధాంలో వాసవీ మాత సన్నిధిలో వాసవీ మాలధారులు



వాసవీ శాంతి ధాంలో హోమం చేస్తున్నబెంగళూరు భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో వాసవీ కన్యకపరమేశ్వరి వాసవీ మాలధారులు ఆదివారం ఇరుముడులు సమర్పించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన వాసవీ మాలధారులు ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శాంతి హోమం నిర్వహించి అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలధారులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వాసవీ శాంతి ధాంలో బెంగుళూరు నుంచి వచ్చిన వాసవీ భక్తులు మరకత శిల వాసవీ మాతకు దంపతుల పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేసి అనంతరం వాసవీ శాంతి హోమం నిర్వహించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన వారోత్సవాలు



తణుకులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: అక్టోబర్ 4 నుంచి 12 వరకు మానసిక ఆరోగ్యం అవగాహన వారోత్సవాలు జాతీయ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. శనివారం మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ తణుకు బ్రాంచ్ లో పీపీఎఐ జాతీయ సెక్రటరీ డా. పి. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పీపీఎఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ డా. వింజరపు జనార్దనం, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డా.ఎంఎస్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా ప్రోగ్రాం అడ్వైసర్ డా. సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు శ్రీమతి లలితాదేవి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు రాజేష్ పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డా. వింజరపు జనార్ధనం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకుపైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ప్రతి ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా డా.హిప్నో కమలాకర్ మానసిక ఆరోగ్యం పై ఇరవై వేల ప్రోగ్రామ్స్ తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డా.ఎంఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరో మనల్ని గుర్తించి గజమాల వేయాలని, పక్క వారితో పోల్చుకోవడంతో మానసిక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మనసు మంచిదన్నారు. కానీ మాయ మాటలు, కఠినమైన ప్రవర్తనలతో మనసును కలత పరుస్తున్నామని తెలిపారు. గాయపడిన మనసుకు ఓదార్పు అవసరమని అందుకే మానసిక ఆరోగ్యం పై అవగాహన ముఖ్యమన్నారు.

చెస్‌లో విద్యార్థి ప్రతిభ



కప్ అందుకున్న బాల సాయి కార్తీక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఇటీవల విజయవాడలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించా రు. తాడేపల్లి గూ డెం పట్టణానికి చెందిన వంగపండు బాల సాయి కార్తీక్ అండర్–12 ఓపెన్‌లో 4.5/6 పాయింట్లు సాధించి మూడోవ స్థానంలో నిలిచాడు. కప్, మెడల్, సర్టిఫికెట్‌లు అందుకున్నారు. విజేతకు కోచ్ ప్రదీప్, పట్టణ ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో తీరని నష్టం



మాట్లాడుతున్న కేవీపీఎస్ మండల కార్యదర్శి మదాసి గోపి

ఉండి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం దళితులకు తీరని నష్టం వాటిల్లుతుందని కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ ఆవేదన వ్యక్తం చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉండి మండలం పాందువ్వలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీపీఎస్ పతాకాన్ని ఎగురవేసిన గోపి మాట్లాడుతూ నిరుపేదలు, బలహీనులకు అండగా ఉండి వారిని పోత్సహించాల్సిన ప్రభుత్వం ప్రైవేటీకరణ బాట పట్టడం బాధాకరమని మండిపడ్డారు. ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం వల్ల ఎంతో మంది పేదవారు ముఖ్యంగా దళితులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో అర్జున్, కాసులు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ప్రశాంత్, బాబూరావు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- మురుగునీటితో పేరుకుపోతున్న కాలువలు
- విజృంభిస్తున్న దోమలు
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



అలంపురం జాతీయ రహదారి, బీసీ ఏరియాలో డ్రైయినేజీలో మురగునీరు



వల్లూరుపల్లిలో ఏరులా పారుతున్న మురుగునీరు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉండాలన్నా, అడుగుపెట్టాలన్న ప్రజలు భయాందోలనకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రజారోగ్యం ప్రమాదకరంగా కనిపిస్తోంది. వీధులు దుర్గంధభరితంగా ఉన్నాయని, వీధుల్లోకి రాలేకపోతున్నామని, వీధి కాలువల పక్కనే నివాస గృహాల్లో నివసించలేకపోతున్నామని అంటూ రోగాల బారిన పడుతున్నామంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఆర్భాటం చేయడమే తప్ప ఆచరణ ఎక్కడా కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. బేనర్లు పట్టి ఏదో మొక్కుబడిగా ర్యాలీ చేసి ఫోటోలకు ఫోజులిచ్చి అక్కడితో మమ అనిపించేస్తున్నారు తప్ప పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించి వీధులు, కాలువలను పరిశుభ్రం చేయించిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోధకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరలేదు. ఇప్పుడు కొత్త స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం ఎక్కడా కనిపించడం లేదు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోధకాలిస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు చెత్తచెదారాలతో పేరుకుపోయి రోడ్లపైనే మురుగునీరు నిల్వతో పల్లె వీధులు అపరిశుభ్ర వాతావరణంలో తాండవిస్తున్నాయి. పారిశుద్ధ్య పనులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు దుర్వాసనతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. వీధి కాలువలు మురుగు నీటితో నిండిపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికినెలవుగా మారుతున్నాయనేది నగ్నసత్యం. ప్రధానంగా కె. పెంటపాడులో పెంటపాడు వెళ్లే దారిలో చెత్త వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. అదే గ్రామంలో లోలెవిల్ కాల్వకు ఆనుకొని ఉన్న కాలనీలో మురుగునీరు లాగక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల నుంచి దుర్వాసన వస్తుందని అక్కడి కాలనీవాసులు చెబుతున్నారు. ఈ గ్రామంతో పాటు, వల్లూరుపల్లి, అలంపురం, జట్లపాలెం గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితమవుతోంది. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను పంచాయతీలకు తరలించకుండా కాలువను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, మిడ్ లెవిల్ కాలువ ప్రాంతాలలో కె. పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాలలోని కాలువలో చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషిత మవుతోంది. ప్రధానంగా కాలువ కింద ఉన్న గ్రామాల్లో అదే నీటిని చెరువులకు పెట్టుకోవడంతో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. తాగునీటి చెరువులకు కూడా తాగునీరు పెట్టడం లేదు. కాలువలు వదిలినా ప్రజలకు తాగునీరు అందడం లేదు. దర్శిపర్రు, వల్లూరుపల్లి గ్రామాలలో ప్రధానంగా అత్యధికులు కాలువలో చెత్తను వేస్తున్నారు. దీంతో పాటు, పంచాయతీ డ్రెయినేజీలు, సెప్టిక్ ట్యాంక్‌లు నేరుగా మిడ్‌లెవిల్ కాలువలోకి పెట్టడంతో దిగువన ఉన్న పలు గ్రామాల పంచాయతీలు అదే నీటితో తాగునీటి చెరువులు నింపుకొంటారు. ఇటీవల ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడి తీరు మార్చుకోవాలని సూచించినా నిధులు లేవంటూ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆ పనులను పట్టించుకోవడం లేదు. అదే నీటిని చెరువులకు పెట్టుకోవాల్సి వస్తోంది. దీనిని పంచాయతీలు అడ్డుకోవడం లేదు. ఆయా పంచాయతీలు జరిమానా వేస్తామని హెచ్చరిక బోర్డులు పెట్టినా లెక్కచేయడం లేదు. దీంతో ఏంచేయాలో తెలియడం లేదని కార్యదర్శులు, సర్పంచ్‌లు వాపోతున్నారు. తక్షణం ఉన్నతాధికారలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు మారారు. వారికి గ్రామాల సమస్యలు పట్టడం లేదు. నిత్యం గ్రామంలో కార్యదర్శితో పాటు, ప్రత్యేకాధికారి పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. పంచాయతీ లెవిల్ పరిష్కరించుకొనే సమస్యలు ఉన్న చోట్ల కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం గురించి అధికారులకు పట్టడం లేదు. ప్రస్తుతం వారంలో కొద్దిరోజులు ఎండ, కొద్దిరోజులు వర్షం ఉంటోంది. ఈ తరుణంలో నీరు కలుషితం అయి ఆ నీటిని ప్రజలు నేరుగా తాగటంవల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వాటర్ ప్లాంట్‌లలో సొమ్ములిచ్చి నీటిని కొనుక్కోలేని వారు పంచాయతీ సరఫరా చేసిన నీటిని తాగడంవల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాంక్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక బ్యాంక్ కాలనీలోని కోప కల్యాణ మండపంలో ఆదివారం కోప, విశ్వకాపు జాగ్రుతి, హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కోప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం ఆప్తమాలజీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్ వంటి వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు.